# అమాయకురాలు

శ్రీ ప్రయాగ సీతారామశాస్త్రి

ఆ రోజు వుదయం తొమ్మిది గంటలప్పుడు అనూరాధ ఒంటరిగా తన గదిలో కూర్చొని వుంది. బావవచ్చినప్పటినుంచి యింట్లో పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. ఏమిటో అర్థం కాదు ఆ వాతావరణం పదేళ్ళ అనూరాధకి. ఎవర్నడిగినా తనకు కావలసిన సమాధానం చెప్పరు. ఇదివరకు తను, అక్క ఒకే మంచంమీద పడుకుండేవారు. ఇప్పుడు అక్క తనదగ్గిర పడుకోవడంలేదు. రాత్రి భోజనాలయ్యాక పరాయి వాడైన శేఖరం బావ దగ్గిర కెళుతుంది. మళ్ళీ తెల్లవారితే గాని రాదు. బావకూడా భోజనానికి తప్ప మేడమీదినుంచి దిగిరాడు. ఏమైనా సరే! ఈ రోజు అనసూయ అక్కను ఈ విధంగా అడుగుదామని తీర్మానించుకొని అక్క గది దగ్గిరకి వెళ్ళేసరికి అక్క గదిలో లేదు. ఛీ! బావ వచ్చిన తరువాత అక్కతో మాట్లాడటానికే వీల్లేకపోతుంది. ఆమె దర్శనాలు మరీ కరువైపోతున్నాయి. మళ్ళీ నేమో అక్క నాకు నీతులు చెపుతుంది. 'ఈడొచ్చిన ఆడపిల్లలు జోడైన మగవారితో యిష్టం వచ్చినట్లు మాట్లాడరాద'ని. తనేమో ఎవరో గుంటూరు వాస్తవ్యులు పరంధామయ్యగారి ఏకైక పుత్రుడా శేఖరం బావతో ఎందుకు మాట్లాడుతుంది? అసలు అక్కకూడా బావకు జతయింది. మేడ మీదికి వెళ్ళిందంటే దిగిరాదు. అదేం ఖర్మమోగాని! బావతో ఎప్పుడూ నవ్వుతూ, హుషారుగ మాట్లాడుతుంది. మధ్య మధ్యలో ఆ బావ ఏదో ఇంగ్లీషు మాట అని బుగ్గమీద చిటిక వేస్తాడు. పరాయి మగవాడితో మాట్లాడరాదనే అక్కయ్య ఆయన (బావ) చేత బుగ్గమీద చిటిక వేయించుకొంటుందా! అప్పుడప్పుడు జడ పట్టుకొని లాగుతూవుంటాడు. 'అబ్బ! యేం సరసం అండీ?' అంటూందేగాని ఒక్కసారైనా కోప్పడదు. నేనైతేనా ఈ పాటికి బావని గోళ్ళతో రక్కేదాన్ని. పాపం! అక్క అమాయకురాలు కాబట్టి వూరుకుంది. ఎంతసేపని తను ఒక్కతే అక్కగదిలో కూర్చొంటుంది. అక్కను పిలుద్దామనుకొంది. అంతలో మేడ మెట్లు దిగివస్తున్నట్లు గుర్తుగా అక్క కాలి మెట్టెల చప్పుడు వినిపించింది. పైనుండి, 'మళ్ళీ ఎప్పుడొస్తావు?' అన్న బావ కంఠం, దానికి సమాధానంగా 'ఒక్క అరగంటలో' అన్న అక్క గొంతూ వినపడ్డాయి అనూరాధకి. ఇంక తన అదృష్టం బాగుంది. కనీసం అరగంట సేపైనా అక్కతో కులాసాగా మాట్లాడుకోవచ్చు అనుకుంది అనూరాధ. 'అక్కా!' అన్న అనురాధగొంతు వినపడేసరికి అనసూయ తన గదిలోకి చూచింది. చెల్లెలు అనురాధ దిగులుగా

కుర్చీలో కూర్చోని, తన కోసమే! అన్నట్లు జాలిగా తన వంక చూచింది.

'అనూ! ఈరోజు స్కూలుకి వెళ్ళలేదా?' అని ప్రశ్నించింది అనసూయ, అనూరాధని.

'బావ వచ్చిన తరువాత నీకు మరీ మతి పోతున్నదక్కా! ఈ రోజు ఆదివారం కదూ!' అని సమాధానమిచ్చింది.

'మరచి పోయేనే! ఆది వారమే! అయితే నన్నిప్పుడు ఎందుకు పిలిచావు?' అని అడిగింది అనసూయ.

'ఒకటి అడుగుతాను ఏమీ అనుకోకుండా సమాధాన మిస్తావా అక్కా!' అని అడిగింది అనురాధ అక్కని.

'నీకు జవాబు చెప్పందెప్పుడే అనూ!' అని అన్నది అనసూయ.

'బావ వచ్చిన తరువాత దర్శనాలే కరువయ్యాయి. దానికేంగాని రాత్రి పూట పరాయివాడు శేఖరం బావదగ్గిరకెళతావెందుకక్కా?'' ప్రశ్నించింది అనురాధ.

అనసూయకు తలతిరిగినంత పనైంది. రోజూ అనురాధని నిద్రపుచ్చే తను పైకి వెళుతున్నది. అయినప్పటికి తను పక్కలో ఎప్పుడు వుంటున్నదీ! లేనిదీ! గ్రహిస్తున్నది అన్నమాట.

'జవాబు చెప్పు అక్కా!' అని బలవంతం చేసింది.

'అది నీకూడా పెళ్ళయిన తరువాత తెలుస్తుంది. ముందరగా చెప్పగూడదు. పెళ్ళయిన తరువాత అమ్మ చెప్పింది. ఈలోపల ఎవరన్నా చెపితే చెప్పినవాళ్ళ తల పగిలిపోతుందట' అని చెప్పి ఈ మాట ఎవ్వరికీ చెప్పకూడదని చెప్పింది అమ్మ' అని బొంకింది అనసూయ.

'నిజంగా తల పగిలి పోతుందక్కా?' అని మళ్ళీ అడిగింది.

'లేకపోతే నీకు ఎప్పుడన్నా అబద్ధం చెప్పానా! చెప్పు అనూ -' అని అంది అనసూయ

'తల పగిలిపోతే చెప్పద్దులే అక్కా! నా మూలంగా నీ తలపగిలితే నాకింకా అనసూయ అక్క ఎవరుంటారు? అది సరే గాని! మొన్న ఒకసారి బావ నీజడలాగితే వూరుకున్నావెందుకక్కా? అమ్మతో చెపితే తల వాచి పోయేట్లు చివాట్లు వేసేదిగా!' అని సావధానంగా అడిగింది అనూరాధ తన అక్కని.

'అసలు ఆయన నన్ను జడపట్టుకెప్పుడు లాగారు?' అని తెలియనట్లు ఎదురు ప్రశ్నించింది అనసూయ!

'మొన్న ప్రొద్దున నీళ్ళు తోడి ఇదిగో సబ్బు, ఇదిగో తుడుచుకోను టవలు, నే లోపలికి వెళుతున్నా'నని బయలుదేరి వస్తూండగా అక్కా బావ జడపట్టుకు లాగలా? అప్పుడక్కా! అమ్మతో ఎందుకు చెప్పలా?' అని పుస్తకంలో పాఠంచూచి చదివినట్లు గడగడా మాట్లాడింది.

'ఓసి నీ! ఇవన్నీ నీవెప్పుడు చూచావే!' అంది.

'అప్పుడు నేను అన్నంతిని చేయి కడుక్కోటానికి దొడ్లో కొచ్చానక్కా' అని సమాధానమిచ్చింది.

'ఆయనకు నా జడను చూస్తే నల్లని త్రాచులా బాగుంటుందిట. అందుచేత ఆయన అప్పుడప్పుడు అలా అంటూ వుంటారు' అని తప్పుకుంది అనసూయ.

'అయితే నీవు స్కూల్లో చదువుకుండే టప్పుడు నీజడ ఎవ్వరికి నచ్చలేదా?' అని ప్రశ్నించింది.

'ఏమో! అది నాకెట్లా తెలుస్తుంది!' అని సమాధానమిచ్చింది.

'ఎవరూ లాగలేదా'' అని మళ్ళీ ప్రశ్నించింది అనూరాధ.

'ఎవరన్నా ఆ పని చేస్తే అమ్మతో చెప్పేదాన్ని' అని జవాబిచ్చింది.

'అయితే ఈయన చేస్తే ఎందుకు చెప్పలా?' అని మళ్ళీ అడిగింది.

'ఆయన చేసినవి అమ్మతో చెపితే రాత్రికి అక్కడకు వెళ్ళినప్పుడు గొంతు పిసికి చంపుతారు తెలుసా!' అంది.

అంతలోకి అమ్మ కంఠం 'అన్నానికి లేవండి!' అని సైరన్ కూసినట్లు వినిపించింది.

'అక్కా నీకో వుపాయం చెపుతాను. తరువాత భోజనానికి వెళదాము. ఏమంటావ్? అని అనూరాధ అంది.

'సరే! చెప్పు' అని సమాధానమిచ్చింది అనసూయ.

''అయితే ఆయనకు కనపడకుండా తిరుగు. పొరపాటున ఎప్పుడన్నా తటస్థపడితే ఆయన పాడు బుద్ధి పోనీదు (అంటే జడలాగటం మొదలైనవి) అప్పుడు అమ్మతో చెప్పి చివాట్లు పెట్టించవచ్చు. రాత్రి పూట ఆయన దగ్గిరికి పోకుండా నాదగ్గిరే పడుకో - అప్పుడు అమ్మతో చెప్తావని గొంతు పిసకడానికి వీలుండదు. ఏం? బాగుందా!' అని ప్రశ్నించింది.

'అయితే నీ పక్క దగ్గిరికి వచ్చి నా గొంతు పిసికితే!' అని తనకు సందేహం వున్నట్లుగా గాలిలోకి విసిరింది ఆ మాటలను అనసూయ.

'నేను మేలుకొని వుంటాను. ఆయన నా పక్క దగ్గిరికి వచ్చినప్పుడు పెద్దగా 'అమ్మా' అని కేకేస్తాను. సరేనా!' అని అనసూయ సందేహానికి సమాధానమిచ్చింది. పాపం! అమాయకురాలైన అనూరాధ.

మళ్ళీ తల్లి కంఠం కొంచెం కటువుగా వినపడింది. ఇద్దరూ భోజనాలకు వెళ్ళారు.

ఆరోజు అక్క పగలు పైకి పోనందుకు 'తన మాటను అంగీకరించింది. అక్క' అనుకొని సంతోషించింది అనురాధ.

డాక్టరు కే. యన్. కేసరిగారి

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాదమ్స్ స్టాల్సులో దొరుకుతుంది